విద్యార్థులకు నాణ్యమైన బోధన

• జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు సిటీ: విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. చిన్నచెరుకూరులోని జెడ్పీ హైస్కూల్‌ను ఆకస్మికంగా బుధవారం తనిఖీ చేశారు. ఉపాధి నిధులతో చేపట్టిన ప్రహరీని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. జెడ్పీ నిధులు రూ.రెండు లక్షలతో పాఠశాలకు మంజూరు చేసి ఆర్వో ప్లాంట్.. శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాన్ని తొలగించేందుకు మంజూరు చేసిన పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థుల భోజనశాలను పరిశీలించారు. బోధన, మౌలిక సదుపాయాలను ఆరాతీశారు. ఎంపీడీఓ శైలజానాథ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆనం అరుణమ్మ

క్షయ రహిత సమాజానికి కృషి


మాట్లాడుతున్న ఖాదర్‌వలీ

నెల్లూరు(అర్బన్): క్షయ రహిత సమాజానికి వైద్యశాఖ సిబ్బంది కృషి చేయాలని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ రాజేశ్వరి, ఏడీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ పేర్కొన్నారు. నగరంలోని ఏసీఎస్సార్ ప్రభుత్వ మెడికల్ కళాశాల సమావేశ మందిరంలో టీబీ నివారణ సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ ద్వారా జిల్లాలో టీబీని నివారించాలని కోరారు. రానున్న మూడు నెలల్లో రోగులను గుర్తించడంతో పాటు వారికి మందులను ఉచితంగా అందజేయనున్నామని వివరించారు. పెద్దాస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ నరేంద్ర, డిప్యూటీ సూపరింటెండెంట్ మస్తాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు కృషి

నెల్లూరు(అర్బన్): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ సూచించారు. నగరంలోని కాపు వీధి సచివాలయ పరిధిలో గల మంగలి వీధిలో మలేరియా కేసు నమోదైన నేపథ్యంలో ఆ ప్రాంతాన్ని బుధవారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. ఫీవర్, లార్వా సర్వేలు, పీడీపీ విధులు, దోమల నివారణకు స్ప్రేయింగ్ చేపట్టాలని సూచించారు. పలువురి రక్త నమూనాలను సేకరించి.. మలేరియా, డెంగీ లాంటి కేసులున్నాయాననే అంశాన్ని పరిశీలించాలని ఆదేశించారు. ఇళ్లలోని డ్రమ్ములు, బకెట్లలో నిల్వ ఉంచిన నీటిని పరిశీలించి.. అందులో దోమల లార్వాలున్నాయాననే అంశాన్ని తనిఖీ చేశారు. అనంతరం సమీపంలోని శిఖరం వారి వీధిలో గల అర్బన్ హెల్త్ సెంటర్‌లో రికార్డులను పరిశీలించారు. మలేరియా నివారణ సహాయాధికారి నాగార్జునరావు, ఎస్‌యూఓలు శ్యామ్ సన్‌బాబు, రామారావు తదితరులు పాల్గొన్నారు.


నీటి డ్రమ్ములను పరిశీలిస్తున్న మలేరియా నివారణాధికారులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని డీఎస్సార్ సబ్‌స్టేషన్ పరిధిలో రోడ్డు వెడల్పు పనుల దృష్ట్యా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా గురువారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రగతినగర్‌లోని ఏ, బీ బ్లాకులు, జెడ్పీ కాలనీ, గౌతమినగర్, లేక్‌వ్యూకాలనీ, సుజాతమ్మ కాలనీ, పొదలకూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

పటిష్టంగా పారిశుధ్య నిర్వహణ


మాట్లాడుతున్న నందన్

నెల్లూరు(బారకాసు): నగరంలోని బారాషహీద్ దర్గాలో నిర్వహించనున్న రొట్టెల పండగలో పారిశుధ్యానికి అత్యంత ప్రాధాన్యమిచ్చి, ఏర్పాట్లను ప్రణాళికబద్ధంగా చేపట్టాలని కమిషనర్ నందన్ సూచించారు. రొట్టెల పండగ నిర్వహణపై కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై ఆరు నుంచి ఐదు రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమంలో భాగంగా విధులు నిర్వర్తించాల్సిన సిబ్బంది జాబితాను సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఇంజినీరింగ్ విభాగ ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఈఈ శేషగిరిరావు, సిటీ ప్లానర్ హిమబిందు, ఎంహెచ్ఓ చైతన్య, వెటర్నరీ డాక్టర్ మదన్‌మోహన్, మలేరియా విభాగాధికారి జిజియాబాయి తదితరులు పాల్గొన్నారు.

• నగరంలోని ప్రధాన మార్గాలతో పాటు వీధుల్లో రోడ్లను ఆక్రమించి ఎలాంటి నిర్మాణాలను చేపట్టొద్దని, ఇలా వ్యవహరిస్తే తొలగిస్తామని కమిషనర్ నందన్ స్పష్టం చేశారు. పదో డివిజన్లోని ఉస్మాన్‌సాహెబ్‌పేట తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. అనంతరం సౌత్‌రాజుపాళెంలో చేపట్టిన శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణ పనులను పర్యవేక్షించారు.

పక్కాగా చెత్త సేకరణ

నెల్లూరు(పొగతోట): గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటి చెత్త సేకరణ ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని డీపీఓ శ్రీధర్‌రెడ్డి ఆదేశించారు. నగరంలోని జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం నుంచి వివిధ మండలాల పంచాయతీ సెక్రటరీలు, ఈఓపీఆర్డీలు, డీఎల్పీఓలతో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. చెత్త సేకరణను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రక్రియను నిత్యం చేపట్టాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో చెత్తను పూర్తిస్థాయిలో తొలగించి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇంటి, కుళాయి పన్నులను నూరు శాతం వసూలు చేయాలని తెలిపారు.

పశువులకు సకాలంలో టీకాలు


మాట్లాడుతున్న అధికారులు

నెల్లూరు(పొగతోట): జిల్లాలో పశువులకు క్రమం తప్పకుండా టీకాలను వేయాలని పశుసంవర్ధక శాఖ డీడీ నాగమణి ఆదేశించారు. నగరంలోని ఆ శాఖ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జబ్బవాపు తదితర వ్యాధులతో పశువులు ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. వీటికి టీకాలను వేయాలని సూచించారు. అనంతరం ఏడీఎల్ ఏడీ డాక్టర్ చైతన్య కిశోర్ మాట్లాడారు. గొర్రెలు, మేకలకు ఉచిత టీకాల కార్యక్రమం, నట్టల నివారణకు మందులను ఈ నెల 26 నుంచి పంపిణీ చేయనున్నామని వెల్లడించారు. డాక్టర్ వసంతరాయలు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రుద్రహోమం



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని శంకరమఠంలో మహామృత్యుంజయ అమృత పాశుపత రుద్రహోమాన్ని బుధవారం నిర్వహించారు. మఠం ప్రాంగణంలోని కామాక్షి సమేత చంద్రమౌళీశ్వర స్వామిని భక్తులు దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. నిర్వాహకులు కొర్రపాటి నందకిశోర్, ఉషాకుమారి దంపతులు పర్యవేక్షించారు.

ఒకే గుర్తింపుతో రెండు కళాశాలల నిర్వహణ


ఆర్ఐఓకు వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు (టౌన్): ఒకే గుర్తింపుతో రెండు కళాశాలలను నిర్వహిస్తున్న బీవీకే గ్రూపు యాజమాన్యంపై చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్స్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు నవీన్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్ఐఓ వరప్రసాద్‌రావుకు వినతిపత్రాన్ని బుధవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కళాశాలల్లో కనీసం క్రీడా మైదానం లేదని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా విద్యార్థుల నుంచి అధిక ఫీజులను వసూలు చేయడంతో పాటు పుస్తకాలను విక్రయిస్తున్నారని చెప్పారు.

నేత్రదానం


శ్రీహరి


వెంకటేష్ (ఫైల్)

నెల్లూరు(అర్బన్): నగరంలోని వెంగళరావునగర్‌కు చెందిన వెండి శ్రీహరి (25) ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ క్రమంలో ఆయన నేత్రాలను కుటుంబసభ్యులు వీరప్ప, అరవ కుమార్, గోపీ, మధుకృష్ణ దానం చేశారు.

• హౌసింగ్‌బోర్డులోని ఇందిరమ్మ కాలనీకి చెందిన పోలి వెంకటేష్ (39) నగరంలోని పెద్దాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ క్రమంలో ఆయన నేత్రాలను కుటుంబసభ్యులు రత్నమ్మ, నరసింహులు, లక్ష్మి దానం చేశారు. నేత్రాలను ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ సునీల్ సేకరించారు. అనంతరం కుటుంబసభ్యులకు నేత్రదాన సర్టిఫికెట్‌ను అందజేశారు. నేత్రదానం చేయాలనుకునే వారు 99595 89321 నంబర్‌ను సంప్రదించాలని సునీల్ కోరారు.

పాఠశాలల యాజమాన్యాలపై చర్యలకు వినతి


డీఈఓ కార్యాలయ ఎదుట ధర్నా

నెల్లూరు (టౌన్): అధిక ఫీజులను వసూలు చేయడంతో పాటు పుస్తకాలను విక్రయిస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై తక్షణమే చర్యలు చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మస్తాన్ షరీఫ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఎదుట బుధవారం చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. టెక్నో, ఈ – టెక్నో, ఒలంపియాడ్ పేర్లు పెట్టి విద్యార్థుల నుంచి రూ.లక్షలను వసూలు చేస్తున్నారని ఆరోపించారు. విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించేలా చూడాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా నేతలు శివమ్ వర్మ, జీవన్, సుధీర్, సిద్ధూ, సాయి, కోటి, మౌళి, జాన్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడి మృతి

నెల్లూరు సిటీ: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు.. కల్లూరుపల్లిలోని ఇందిరమ్మకాలనీకి చెందిన వెంకటేష్ (39) బేల్దారి పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో మద్యానికి బానిసయ్యారు. ఈ క్రమంలో చెదల మందును తన ఇంట్లో మంగళవారం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కుటుంబసభ్యులు గమనించి హాస్పిటల్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. నెల్లూరు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

ఐటీఐలో క్యాంపస్ డ్రైవ్



నెల్లూరు (టౌన్): వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో క్యాంపస్ డ్రైవ్‌ను బుధవారం నిర్వహించారు. 250 మందికి ఉద్యోగాలను కల్పించారని ప్రిన్సిపల్ శ్రీధర్ రెడ్డి తెలిపారు. జిల్లాకు చెందిన తొమ్మిది కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు.

తెలంగాణ విద్యుత్ డైరెక్టర్‌గా నెల్లూరు వాసి


నరసింహులు

నెల్లూరు (వీఆర్సీ సెంటర్): తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సంస్థ డైరెక్టర్‌గా నెల్లూరు జిల్లాకు చెందిన నరసింహులు నియమితులయ్యారు. ఉద్యోగ బాధ్యతలను బుధవారం ఆయన స్వీకరించారు. జిల్లాలోని కలువాయి మండలం కుల్లూరుకు చెందిన నరసింహులు 1992లో ఏపీఎస్ఈబీలో ఏఈగా నియమితులయ్యారు. పదోన్నతులు పొందుతూ ఎస్పీడీసీఎల్ తిరుపతిలో ఎస్ఈగా విధులు నిర్వర్తిస్తూ వచ్చారు. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణ రాష్ట్రానికి వెళ్లడంతో అక్కడి దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్స్)గా నియమితులయ్యారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని ద్రౌపదీదేవి సమేత కృష్ణ ధర్మరాజస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణను బుధవారం నిర్వహించారు. భగవద్గీత పఠనం, మహాభారత పురాణ కాలక్షేప కార్యక్రమాన్ని జరిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉభయకర్తగా కంచి శ్రీధర్ వ్యవహరించారు. ఈఓ జానకి పర్యవేక్షించారు.

కేన్సర్‌కు ఆధునిక వైద్యసేవలు


మాట్లాడుతున్న శ్రీరామ్ సతీష్

నెల్లూరు(అర్బన్): నగరంలోని అపోలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అన్ని రకాల కేన్సర్ వ్యాధులకు అత్యాధునిక వైద్యసేవలందిస్తున్నామని ఆస్పత్రి డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్ పేర్కొన్నారు. ఆస్పత్రిలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆంకాలజీ ఫిజీషియన్ హరిత, సర్జికల్ ఆంకాలజిస్ట్ ప్రసాద్, మానసిక వైద్యులు లక్ష్మీరాజేష్, యూనిట్ హెడ్ బాలరాజుతో కలిసి ఆయన మాట్లాడారు. కేన్సర్‌ను జయించి పూర్తి ఆరోగ్యంగా ఉన్న వారి మనోగతాలను ప్రజలకు తెలియజేస్తున్నామని వివరించారు. వ్యాధిని ముందస్తుగా గుర్తిస్తే సులభతరంగా నయం చేయొచ్చని చెప్పారు. కేన్సర్ చికిత్సలను తమ ఆస్పత్రిలో అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. అనంతరం వ్యాధిని జయించిన పలువురు తమ మనోగతాలను వివరించారు.

ఏకలవ్యుడి జయంతిని అధికారికంగా జరపాలి


మంత్రికి వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు రూరల్: ఏకలవ్యుడి జయంతిని అధికారికంగా జరపాలని ఏపీ ఏరుకుల సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు శివ కోరారు. ఈ మేరకు కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సుధారాణికి వినతిపత్రాన్ని బుధవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. తమ సమస్యలను తెలియజేసేందుకు ఐటీడీఏకు వెళ్తే, సరైన సమాధానం చెప్పడంలేదన్నారు. ఎరుకల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

బీమా ఏజెంట్ల నియామకానికి ఇంటర్వ్యూలు

నెల్లూరు రూరల్: నెల్లూరు పోస్టల్ డివిజన్ పరిధిలో తపాలా జీవిత బీమా పాలసీల సేకరణకు సంబంధించిన ఏజెంట్ల నియామకం కోసం ఇంటర్వ్యూలను గురువారం నుంచి ఈ నెలాఖరు వరకు నిర్వహించనున్నామని పోస్టల్ డివిజనల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై.. 18 నుంచి 65 ఏళ్లలోపు గల వారు అర్హులని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు, ఒరిజినల్ సర్టిఫికెట్లు, బయోడేటాతో నెల్లూరు పోస్టల్ డివిజనల్ కార్యాలయంలో ఉదయం పది నుంచి నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. ఎంపికైన వారికి 12 నెలల కాలపరిమితికి బీమా ఏజెంట్లుగా నియమిస్తూ ఐడీ కార్డు, ఏజెంట్ కోడ్‌తో పాటు లైసెన్స్‌లు జారీ చేయనున్నామని, వీరు సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.ఐదు వేలను చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. ఈ మొత్తానికి సరిపడా ఎన్ఎస్సీ బాండ్‌ను ఏజెంట్ పేరును జారీ చేయనున్నామని, వివరాలకు 0861 – 2331748 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బాలనేరస్తుడి వద్ద బంగారం స్వాధీనం

నెల్లూరు సిటీ: అనుమానాస్పదంగా తిరుగుతున్న బాలనేరస్తుడ్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి బంగారు, వెండిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బృందంగా ఏర్పడి అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచారు. ఈ క్రమంలో పోలీస్‌స్టేషన్ పరిధిలోని అఫ్రీద్ జ్యువెలరీస్ ఎదుట రాజీవ్‌గృహకల్పకు చెందిన ఓ బాలుడు అనుమానాస్పదంగా తిరగసాగారు. అనుమానమొచ్చి పోలీసులు తనిఖీ చేయగా, రూ.1.5 లక్షల విలువచేసే 16 గ్రాముల బంగారం.. 310 గ్రాముల వెండి వస్తువులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. చిన్నబజార్, సంతపేట, రూరల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన కేసుల్లోని వస్తువులుగా గుర్తించారు. తిరుపతిలోని జువెనైల్ కోర్టులో బాలుడ్ని హాజరుపర్చారు.